క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్‌ఏ గణేష్ తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి ఎల్లమ్మ మృతదేహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం, క్రిస్టియన్లకు డీఎస్సీ ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం సీఈడీఎం వారి ఆధ్వర్యంలో ముస్లింలు, క్రిస్టియన్ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్‌తోపాటు ఉచిత మెటీరియల్, ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శ్రీప్రజ్ఞ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ సి.మల్లీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని నారాయణపురంలోని శ్రీప్రజ్ఞ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఈ డీఎస్సీ ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉచిత కోచింగ్‌తోపాటు ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ హరిబాబు మోటివేషన్ తరగతులు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు హాజరయ్యేవారు డీఎస్సీ అప్లికేషన్‌తో పాటు రేషన్ కార్డు, ఆధార్, బీఈడీ, డీఎడ్ సర్టిఫికెట్లతో రెండు రోజుల్లోపు తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల వారు 73827 53550, 99123 77296లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ముస్లిం, క్రిస్టియన్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మద్రాస్ హైకోర్టు జస్టిస్ సెంథిల్ కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం మద్రాస్ హైకోర్టు జస్టిస్ సెంథిల్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరత నాట్యం అలరించింది. బెంగళూరుకు చెందిన రంజని, ఉమేష్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా రంగపూజ, పుష్పాంజలి, తొడియంగల, గణపతి స్తోత్రం, తిల్లాన, అన్నమయ్య సంకీర్తనలు తదితర పాటలకు కళాకారులు ప్రణమ్మ, ధాన్విక, దీపిక, సహస్ర, సాన్విక్తా రెడ్డి, గౌతమి, జ్ఞాపిక, ఇషిత, అఫ్సాన, అక్షయ, లావణ్య దిశా, ప్రజ్ఞా భరద్వాజ్, సృజతన, శ్రీనిధి నాగరాజ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆలయాన్ని శుద్ధి చేసిన శివభక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటపల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తమిళనాడు అడయారుకు చెందిన శ్రీతాండుండీశ్వర తిరుకోయిల్ సంఘం సభ్యులు(60 మంది శివ భక్తులు) పరిశుభ్రత పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణం, పరివార దేవతామూర్తుల ఆధార పీఠాలు, నవగ్రహ సన్నిధి, ప్రదోష మండపాన్ని పరిశుభ్రం చేశారు. ఏటా మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు శివభక్తులు ఆలయం మొత్తం శుద్ధి చేయడం ఆనవాయితీ అని దేవస్థానం చైర్మన్ బాలాజీ రెడ్డి తెలిపారు.

ఆపద్బాంధవి అమ్మయప్పర్..



నింద్రలో నిర్మించిన గార్మెంట్ ఫ్యాక్టరీ

- నింద్ర మండలం ఎంఎస్‌వీఎం పురంలో అమ్మయప్పర్ గార్మెంట్ ఫ్యాక్టరీ
- తొలివిడతగా 3 వేలమందికి ఉద్యోగాలు
- ఇప్పటికే ఇంటర్వ్యూలు నిర్వహించి 400 మంది ఉద్యోగాలకు ఎంపిక
- మహిళా నిరుద్యోగుల్లో వెల్లివిరిసిన ఆనందం



భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా (ఫైల్)

నింద్ర : ప్రస్తుత ప్రభుత్వ సహకారంతో మండలంలోని ఎంఎస్‌వీఎంపురం గ్రామంలో తమిళనాడుకు చెందిన అమ్మయప్పర్ సంస్థ నిర్మించిన గార్మెంట్ ఫ్యాక్టరీ మహిళా నిరుద్యోగుల పాలిట వరప్రదాయనిగా మారింది. తమిళనాడు వ్యాప్తంగా 20 గార్మెంట్ ఫ్యాక్టరీలు నడుపుతున్న అమ్మయప్పర్ సంస్థ చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన తొలి ఫ్యాక్టరీ ఇదే కావడం విశేషం. రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా చొరవతోనే యాజమాన్యం నింద్ర మండలంలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభించడం జరిగింది. మూడేళ్లపాటు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఈ ఫ్యాక్టరీ ప్రస్తుతం ఉత్పత్తిని ప్రారంభించింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 3 వేలమంది మహిళలకు ఉపాధి లభించనుంది. ఇందులో భాగంగా తొలి విడతలో ఇంటర్వ్యూలు నిర్వహించి మండలంలోని 400 మందికి ఉపాధి కల్పించడం జరిగింది. ఉపాధితో పాటు టైలరింగ్‌లో శిక్షణ, బస్సు సౌకర్యం కూడా అందిస్తున్నట్లు, ప్రావిడెంట్ ఫండ్ అందిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. భవిష్యత్‌లో ఉద్యోగుల పిల్లలకు విద్య, వైద్యసౌకర్యం కల్పిస్తామన్నారు. ఇలాగే మలి విడత ఇంటర్వ్యూల్లో నియోజకవర్గంలోని నగరి, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాలకు చెందిన వారికి కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. నియోజకవర్గంలో మూడువేల మంది మహిళలకు ఉపాధి కల్పించే ఒక ఫ్యాక్టరీని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ ఆనందాన్ని వారు ఇలా వ్యక్తం చేస్తున్నారు.

ఇదివరలో తమిళనాడుకు వెళ్లేవాళ్లం..



ఇదివరలో తమిళనాడు తిరుత్తణిలో గార్మెంట్ ఫ్యాక్టరీలో పనికి వెళ్లేదాన్ని. అంతదూరం వెళ్లాల్సి ఉండడంతో వేకువజామునే వెళ్లాల్సి ఉండేది. తిరిగి ఇంటికి చేరుకునే సరికి రాత్రి అయ్యేది. దీంతో పిల్లాపాపల ఆలనాపాలన చూసుకోవడం కష్టతరమయ్యేది. నేడు ఆ సమస్య తప్పింది. స్థానికంగా ఉద్యోగం ఉండడంతో నా కుటుంబాన్ని చూసుకునే వీలుకలిగింది. – సుమతి, నింద్ర దళితవాడ

స్థానికంగానే ఉద్యోగం..



ఉన్న ప్రాంతంలోనే ఉద్యోగం లభించడం ఊహించని వరం. ఒక మహిళగా సాటి మహిళ కష్టాలను మంత్రి ఆర్‌కే రోజా అర్థం చేసుకున్నారు. నేడు కుటుంబ పోషణలో నేనూ పాలుపంచుకునేలా ఉద్యోగం వచ్చింది. స్థానికంగానే ఉద్యోగం లభించడంతో కుటుంబాన్ని చూసుకుంటూ ఉద్యోగాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా చేసుకునే వీలు కలిగింది. – కుమారి, నింద్ర

మా ఇలవేల్పు రోజమ్మ..



ఒక ఉద్యోగం వస్తే అది కుటుంబాన్ని ఆదుకుంటుంది. ఆసరాగా నిలుస్తుంది. నేడు ఇంతమంది మహిళలకు ఉద్యోగం రావడం అంటే అది మామూలు విషయం కాదు. నాడు రోజమ్మ చొరవ తీసుకుని ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టించకుంటే నేడు మాకు ఉద్యోగాలు వచ్చేవి కావు. అందుకే మా పాలిట ఇలవేల్పు రోజమ్మ.

– జూలి, నింద్ర దళితవాడ

ఉద్యోగం దొరికింది..



ఇంటర్ వరకు చదివాను. ఏదైనా ఉద్యోగం వస్తే కుటుంబానికి ఆదరణగా ఉండవచ్చని ఎన్నోరోజులుగా ఎదురు చూస్తున్నా. నేడు ఎదురు చూస్తున్న ఉద్యోగం దొరికింది. మహిళలతో పాటే వెళ్లి రావొచ్చు. ఇది రక్షణతో కూడిన ఉద్యోగం. గ్రామీణ ప్రాంతంలో ఇలా ఫ్యాక్టరీ పెట్టి ఉద్యోగాలు ఇవ్వడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. సంక్షేమం, అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నారు. – సెల్వి, నింద్ర

సంక్షేమ ప్రదాత సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

- అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి
- మండలంలో ప్రభుత్వ సహకారంతో రూ.కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేశాం
- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం
- మండలమీట్‌లో ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనిత అన్నారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.20 లక్షలతో గ్రామాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఇంకా మిగిలిపోయిన కొన్ని పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ ప్రదాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, ప్రతి నాయకుడు, కార్యకర్త కూడా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, సింగిల్‌విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, సర్పంచ్ సీనియర్ నాయకులు మునిరాజా రెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్, ఏపీఎం చిరంజీవి, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, ఏఓ వందన, సర్పంచులు ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీట్ల కంటే ప్యాకేజీనే పవన్‌కు ముఖ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం : వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు ఉంటే టీడీపీ, జనసేన, కాంగ్రెసు మరిన్ని ఇతర పార్టీలు మరోవైపు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీతో పొత్తు పెట్టుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఎక్కువ సీట్లు తెచ్చుకుని గెలవాలనే ఆలోచన లేదని, ఎక్కువ ప్యాకేజీ వస్తే చాలు అనుకుంటున్నారని అన్నారు. అందుకు టీడీపీ– జనసేన పార్టీలు ప్రకటించిన స్థానాలే నిదర్శనం అని అన్నారు. సీఎం జగనన్నను ఎదుర్కోలేక చంద్రబాబుకు, పవన్‌కు ఓటమి పట్టుకుందని, అందువల్లే వారు పొత్తు పెట్టుకున్నారని, ఎన్ని పార్టీలు కలిసివచ్చినా గెలుపే వైఎస్సార్‌సీపీదే అన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా థామస్‌కు సీటు వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన థామస్ దళితులనే హీనంగా చూడడం, అసహ్యించుకోవడంతో పాటు దళితులు డబ్బులకు అమ్ముడుపోతారని మాట్లాడడం సరి కాదన్నారు. దళితులను చిన్నచూపు చూస్తున్న థామస్‌కు, వారి ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో దళిత గ్రామాలను గతంలో ఎన్నడూ లేనివిధంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో అభివృద్ధి చేశారన్నారు. రోడ్లు, ఇళ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్, ఆలయాల్లో మౌలిక వసతులను కల్పించిన ఘనత వారిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు విజయాబాబు, జెడ్పీటీసీ మాజీసభ్యులు గురవారెడ్డి, సర్పంచ్ డిల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు మణి, జనార్దన్, బాబు, లోకయ్య, శేఖర్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ

తిరుపతి సిటీ: ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ రచించిన 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ వేదికగా మంగళవారం నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలోని ప్రముఖ రూప పబ్లికేషన్స్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఇదే పుస్తకాన్ని ఆయన ఆంగ్లంలోనూ రచించారు. ఆంగ్ల సంపుటిని గత మాసం 16వ తేదీన ఢిల్లీలో ఆవిష్కరించారు. తెలుగులో రచించిన పుస్తక పరిచయ సభకు పేరొందిన సీనియర్ పాత్రికేయులు, మేధావులు హాజరుకానున్నారు. మూడు దారులు పుస్తక రచనలో ప్రధానంగా రచయిత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురు నాయకులు ప్రజాసేవలో ఎంచుకున్న విభిన్నమైన దారులు, అనుసరించిన పద్ధతులు, పాలనపైన సవివరంగా ప్రస్తావించారు. అధికారం కోసం వెన్నుపోట్లకు సైతం వెనుకాడని వారి తెగింపును కళ్లకు కట్టినట్లు రచయిత పుస్తకంలో పొందుపరిచారు. దీంతో పాటు తెలుగు రాష్ట్రాల ఆవిర్భావం, విలీనం, విభజన పరిణామాలు, ఉద్యమాలు, ఆంధ్రరాష్ట్ర రాజకీయాలపై విశ్లేషణాత్మక రచన చేశారు.

తిరునామాలకు విశేష పూజలు



పూలంకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని శంఖ, చక్ర, తిరునామాలకు, ఆలయ శిఖరాలకు పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. శంఖ, చక్ర, తిరునామలకు అభిషేకాలు చేసి, పూల అంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు హారతులు ఇచ్చారు.

ఆలయ ప్రతిష్టను దిగజార్చవద్దు



గంటలను చూపుతున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రతిష్టను దిగజార్చే విధంగా టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హితవు పలికారు. ఆలయ పరిపాలన భవనంలో ఆదివారం పాలక మండలి సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సూక్ష్మనంది, బంగారు గంటలు మాయమైనట్లు శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాతి ధ్వజస్తంభం వద్ద సూక్ష్మనందికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బంగారు తొడుగు చేయించారని వెల్లడించారు. అందులో భాగంగా పాత ఇత్తడి గంటలు తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత వాటిని ఆలయ అలంకార మండపంలో భద్రపరిచామంటూ మీడియా ఎదుట ప్రదర్శించారు. ఇత్తడి గంటలను బంగారు గంటలు అంటూ అసత్య ప్రచా రం చేయడం సుధీర్‌రెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. తిరుమంజనం గోపురం విశిష్టత కాపాడు తూ మెట్లు ఏ మాత్రం అణువంతు కూడా దెబ్బతినకుండా వాటిపై సులభంగా ఎక్కేందుకు ఇనుప మెట్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేవలం మహాశివరాత్రి పర్వదినాన ప్రత్యేక దర్శనా ల కోసమే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శివం టు శివం రోడ్డు రూ.19లక్షలతో టెండరు పిలిచి పనులు చేపడుతున్నారని చెప్పారు. నాలుగు మాడవీధుల్లో ఆధునిక లైటింగ్ విధానం తీసుకొచ్చే పను లు రూ.2 కోట్లతో చేపట్టామని, అయితే దేవదాయ శాఖ అనుమతుల వల్ల ఆలస్యం జరిగిందే తప్ప శివరాత్రి ముందు హడావుడి చేయడం లేదని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా యుద్ధప్రతిపాదికన పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా సన్నిధివీధిలో డబుల్‌రోడ్డు వచ్చే విధంగా నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. సన్నిధివీధిలో తేరువీధి నుంచి వచ్చేలా కూడా రోడ్డు నిర్మాణం చేస్తున్నా మని, వాహన మండపానికి అడ్డుగా లేకుండా గాంధీజీ విగ్రహాన్ని పక్కకు జరిపే ఏర్పాటు చేస్తున్నామే కానీ తొలగించలేదన్నారు. కేవలం స్వార్థ రాజకీయాల కోసం అసత్య ఆరోపణలు చేయడం బొజ్జల సుధీర్ రెడ్డికి తగదని హితవు పలికారు. గత 30 ఏళ్లు అధికారం చెలాయించిన బొజ్జల కుటుంబం ఆలయ అభివృద్ధికి ఏమాత్రం పాటు పడలేదని గుర్తుచేశారు. కనీసం ఇప్పుడైనా మహాశివరాత్రి వే డుకలకు భూరి విరాళం అందించి భక్తిని చాటుకో వాలని కోరారు. పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కరాటే ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సత్యవేడు: మండలంలోని పల్లెల్లో కరాటే ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ జీఎం భునేశ్వర్ (4వ డాన్ బ్లాక్ బెల్టు) తెలిపారు. ఆదివారం కాళమనాయుడు పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను సర్పంచ్ టి.జయ, సత్యవేడు వైద్యశాల హాస్పిటల్ కమిటీ సభ్యుడు ఈ.గోవిందస్వామి ప్రారంభించారు. కటా, జూడో తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కరాటే మాస్టర్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా సత్యవేడు మండలంలో గోజూరియో దూ కరాటే ఇండియా పేరుతో శిక్షణ తరగతులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. 200 మందికి పైగా శిక్షణ పొందారన్నారు. జూలైనెలలో చెన్నైలోని మైలాపూర్‌లో నిర్వహించనున్న ఇంటర్ నేషనల్ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు శిక్షకుడు టి.సూర్య(బ్లాక్ బెల్టు) శిక్షణ ప్రారంభించారు.

రావణ బ్రహ్మ వాహనంపై విహారం



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారు మంగళవాయిద్యాల హోరు నడుమ రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయం వద్ద అభిషేకం, వసంతోత్సవం , ప్రత్యేక పూజలు, ధ్వజావరోహణం, త్రిశూల స్నానం..ఇత్యాది కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం శయనోత్సవంతో ఆలయ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ చైర్మన్ వీరభద్ర చెప్పారు.

శాస్త్రోక్తంగా దోపోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఘనంగా దోపోత్సవం జరిగింది. మొదట స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకారమండపంలో పలు రకాల అభిషేకపూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకున్న అనంతరం దోపోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలో ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముందు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం చేపట్టారు. తర్వాత 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సుగంధ ద్రవ్యాలు తీసుకొస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

గాంధీ తత్వాన్ని అలవరచుకోవాలి

తిరుపతి సిటీ: మొక్కవోని ధైర్యంతో అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపి విజయం సాధించిన మహాత్మాగాంధీ తత్వాన్ని, ఆలోచన విధానాన్ని మనం అలవర్చుకోవాలని ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మూరిశెట్టి గోవింద్ రచించిన 'సుదీర్ఘ స్వప్నం' నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం, మన దేశం అనే భావన మనిషిలో కొరవడిందని, నేను అనే భావన సమాజంలో నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ సిద్ధాంతాలు, దేశభక్తి ప్రతి వ్యక్తి అలవర్చుకోవాలని కోరారు. సుదీర్ఘ స్వప్నం గాంధీ ఇతివృత్తంతో రాసిన పుస్తకమని తెలియజేశారు. అనంతరం సమీక్షకులు డాక్టర్ వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గాంధీ ఆశయాలను విస్మరించవద్దన్నారు. నవల విశిష్టతను, రచనా శిల్పాన్ని ఆయన ఈ సందర్భంగా సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగోలు క్రిష్ణారెడ్డి, డాక్టర్ సాకం నాగరాజు, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, బాలసుబ్రమణ్యం, గంగాధరప్రసాద్, ఆముదాల మురళి, రామచంద్రారెడ్డి, దామోదరం సుభద్ర, రాజు, రచయితలు పాల్గొన్నారు.



నవలను ఆవిష్కరిస్తున్న వీసీ, అతిథులు

నేడు నంది విగ్రహం ప్రారంభం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరా లయంలోని రాజగోపురం ఎదుట నూతనంగా నిర్మించిన మహానంది విగ్రహాన్ని సోమవారం ఉదయం 9గంటలకు ప్రారంభించనున్నట్లు విగ్రహదాత డాక్టర్ బొప్పన మోహనమురళీ తెలిపారు. శాస్త్రోక్తంగా చేపడుతున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి భక్తులు తరలి రావాలని కోరారు.

